ప్రజాశక్తి
శనివారం 23 డిసెంబరు 2023
5
శ్రీకాకుళం

వైసిపి పాలనపై విసిగిపోయారు

బూర్జ : వైసిపి ప్రభుత్వ అరాచక పాలనపై రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కొల్లివలస కూడలిలో టిడిపి కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలన బ్రిటిష్ పాలనను తలపిస్తోందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా, ఎప్పుడు వైసిపిని సాగనంపుదామా అని ప్రజలు వేచిచూస్తున్నారని చెప్పారు. యువగళం ముగింపు సభకు హాజరైన జనంతోనే వైసిపి పతనం ప్రారంభమైందన్నారు. ముఖ్యమంత్రి జగన్ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చడం కాదని, ఆయన్నే ఎమ్మెల్యేలు అవిశ్వాస తీర్మానం పెట్టి మార్చాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రామ్‌జీ, టిడిపి నాయకులు లంక జగన్నాథ నాయుడు, సీతబాబు, హనుమంతు గోపి తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేనికి ఖాయమేనా..?

- వ్యతిరేకత ఉన్నా సీతారాం వైపే అధిష్టానం మొగ్గు?
- టికెట్ నిరాకరిస్తే అసలుకే మోసమని అనుమానం
- మనకే టిక్కెట్ అంటూ తనయుడు చిరంజీవికి సీతారాం ఫోన్



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆమదాలవలస వైసిపి టిక్కెట్ మళ్లీ తమ్మినేని సీతారాంకే అంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం సాగుతోంది. ఆమదాలవలస అసెంబ్లీ స్థానానికి వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిని మారుస్తారంటూ కొద్దిరోజులుగా ప్రచారం సాగింది. అధిష్టానం పరిశీలించిన పేర్లలో ఆమదాలవలస చెందిన చింతాడ రవికుమార్ పేరు ప్రధానంగా వినిపించింది. ఆయన్ను ఈనెల 18న అమరావతికి పిలిపించినట్లు తెలిసింది. ఐ ప్యాక్ చీఫ్ ఆయనతో సుమారు గంటన్నర పాటు మాట్లాడినట్లు సమాచారం. మీ అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తామంటూ హామీ ఇచ్చినట్లు తెలిసింది. తర్వాత ఈనెల 22న అమరావతిలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంతో రెండు గంటల పాటు మాట్లాడినట్లు సమాచారం. ఐ ప్యాక్ చీఫ్ సిఫార్సు చేసిన అభ్యర్థిత్వానికే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆమోద ముద్ర వేస్తారనే ప్రచారం ఉంది. ఐ ప్యాక్ చీఫ్ తమ్మినేని సీతారాంకు ఏం మాట ఇచ్చారో..?, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందుకు ఆమోదం తెలుపుతారో?, లేదో? చూడాల్సి ఉంది. మరోవైపు సరుబుజ్జిలిలో ట్యాబ్‌ల పంపిణీలో ఉన్న సీతారాం తనయుడు చిరంజీకి తమ్మినేని ఫోన్ చేసి మనకే టిక్కెట్ అంటూ చెప్పినట్లు తెలుస్తోంది.

వారిద్దరూ ఒక్కటవుతారనేనా?

ఆమదాలవలసకు మళ్లీ తమ్మినేని సీతారాం వైపు మొగ్గు చూపడానికి ప్రధానంగా రాజకీయ కారణాలే కనిపిస్తున్నాయి. టిడిపి తరుపున మళ్లీ మాజీ విప్ కూన రవికుమార్ పోటీ చేస్తారని వైసిపి భావిస్తోంది. ఈ నేపథ్యంలో తమ్మినేనికి టిక్కెట్ నిరాకరిస్తే, అధిష్టానంపై ఆగ్రహంతో మేనల్లుడికి మద్దతు తెలిపే అవకాశాలూ లేకపోలేదు. ఇది మొదటికే మోసం వస్తుందని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తమ్మినేనిపై ఉన్న వ్యతిరేకత ఉంటే అది ఎన్నికల ఫలితాల తర్వాత తెలుస్తుంది. టిక్కెట్ నిరాకరిస్తే మాత్రం దాని ఫలితం ముందుగానే అధిష్టానం ఊహిస్తున్నట్లుగా తెలుస్తోంది.

సీతారాంకు టిక్కెట్ నిరాకరిస్తే, ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నట్లు పార్టీ భావిస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో తమ్మినేని కొంతకాలంగా తీవ్ర అసమ్మతిని ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలో పార్టీ మూడు గ్రూపులుగా చీలింది. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం వైఖరి నచ్చక నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ అసమ్మతి నెలకొంది. తమ్మినేని పాల్గొంటున్న పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తమ్మినేనికి టిక్కెట్ ఖరారైన పక్షంలో వ్యతిరేక వర్గీయులు అంతా కలిసి పనిచేస్తారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో మూడేళ్లుగా ప్రజా సమస్యలపై పనిచేస్తూ పార్టీపరంగా కార్యక్రమాలు చేస్తూ తమ్మినేనిని విభేధించిన నాయకులు, ఇప్పుడు సీతారాంతో చేతులు కలుపుతారా అన్న చర్చ నియోజకవర్గంలో సాగుతోంది. టిక్కెట్ ఇవ్వకపోతే తమ్మినేని తన మేనల్లుడు, టిడిపి అభ్యర్థి కూన రవికుమార్‌కు లోపాయికారీగా సాయమందించే అవకాశాలు ఉండవచ్చని భావిస్తున్న అధిష్టానం, మరి ఆ పని సీతారాం వ్యతిరేక వర్గీయులే చేస్తే దానికి ఎవరు చెప్పగలరని నియోజకవర్గ వైసిపిలో చర్చ నడుస్తోంది. మొత్తమ్మీద ఆమదాలవలస వైసిపిలో రాజకీయ పరిణామాలు టిడిపికి కలిసొచ్చినట్లుగా కనిపిస్తోందని చర్చ సాగుతోంది.

శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న ఇండియా వేదిక నాయకులు

ఎంపీల సస్పెన్షన్ సిగ్గుచేటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పార్లమెంటులోకి దుండగులు చొరబడిన ఘటనపై ప్రశ్నించిన 146 మంది లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను సస్పెండ్ చేయడం సిగ్గుచేటు అని 'ఇండియా' వేదిక నాయకులు అన్నారు. మోడీ ప్రభుత్వ నిరంకుశ చర్యలు, ఎంపీల సస్పెన్షన్‌ను నిరసిస్తూ 'ఇండియా' వేదిక దేశవ్యాప్త ఆందోళనల్లో భాగంగా నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సనపల అన్నాజీరావు మాట్లాడుతూ పార్లమెంటు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసి మోడీ ప్రభుత్వం సరికొత్త రికార్డు సృష్టించిందని విమర్శించారు. బిజెపి ఎంపీ ఇచ్చిన సిఫారసు లేఖ ద్వారా ఈనెల 13న లోక్‌సభ గ్యాలరీలోకి అగంతకులు సందర్శకులుగా ప్రవేశించి, పొగబాంబులు వదిలి అలజడి రేపారని గుర్తుచేశారు. పార్లమెంటులో భద్రతా వైఫల్యాలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని సదరు ఎంపీలు డిమాండ్ చేయడమే నేరంగా పరిగణించిన మోడీ సర్కార్ పార్లమెంట్ ఉభయ సభల నుంచి 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసిందని ధ్వజమెత్తారు. మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానానికి ఇది పరాకాష్ట అని అన్నారు. పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నా రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు నోరు ఎత్తడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్తున్న టిడిపి, దేశ చట్ట సభల్లో మోడీ నిరంకుశత్వంపై ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు. వైసిపి, టిడిపి పార్లమెంట్లో బిజెపికి మద్దతు ఇవ్వడం సిగ్గుచేటని వారన్నారు. ఇప్పటికైనా ఆ పార్టీల వైఖరి మార్చుకొని బిజెపి నిరంకుశత్వంను వ్యతిరేకించాలని కోరారు. ధర్నాలో సిపిఎం నాయకులు బి.కృష్ణమూర్తి, కె.మోహనరావు, జి.సింహాచలం, పి.తేజేశ్వరరావు, కె.అప్పారావు, ఎం.గోపి, కాంగ్రెస్ నాయకులు పి.నాగభూషణం, డి.గోవింద్, పి.శాంతికుమారి, ఎ.రామనర్సు తదితరులు పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఇండియా వేదిక నాయకులు ధర్నా చేపట్టారు. పార్లమెంటులో దుండగులు చొరబడిన ఘటనపై సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దువ్వాడ జీవితేశ్వరరావు, సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ నాయకులు తామాడ సన్యాసిరావు, మద్దిల వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి మాట తప్పడం వల్లే సమ్మె

సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాంతారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమగ్ర శిక్షలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట తప్పడం వల్లే సమ్మె చేపట్టాల్సి వచ్చిందని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి మూడో రోజుకు చేరింది. నగరంలోని జ్యోతిరావు పూలే పార్కు వద్ద సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినిమం టైం స్కేల్, హెచ్‌ఆర్‌ఎ, డిఎ అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. పార్ట్ టైమ్ విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైమ్ కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలకు పెంచడంతో పాటు పెండింగ్ ఎక్స్‌గ్రేషియాలను వెంటనే చెల్లించాలన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియమాలు చేపట్టాలని కోరారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ (జెఎసి) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.మురళీకృష్ణ, పి.తవిటినాయుడు, కోశాధికారి డి.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, ఎ.అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- రబీకి సాగునీరు సాధ్యం కాదు
- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలుకు షెడ్యూల్ ఇవ్వడం అంటే నాణ్యతా పరీక్షలకు సిద్ధం కావడం తప్ప వెంటనే కొనుగోలు జరగవని, రెండు మూడు రోజుల సమయం పడుతుందని చెప్పారు. ఈ విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వాటి పరిష్కారం కోసం సంబంధిత సాంకేతిక నిపుణుల ఫోన్ నంబర్లను ఆర్‌బికె సిబ్బందికి అందుబాటులో ఉంచాలన్నారు. జలుమూరు, సారవకోట, కోటబొమ్మాళిలో ఎక్కువ ధాన్యం సిద్ధంగా ఉన్నందున మిల్లర్ల నుంచి అదనంగా బ్యాంకు గ్యారంటీలను తీసుకోవాలని సూచించారు. పలాస, రణస్థలం, పొందూరు, హిరమండలం, కవిటి, కంచిలి మండలాల్లో ఇంకా కేంద్రాలు ప్రారంభం కాకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. జిపిఎస్ పరికరాలు కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఆర్‌బికెకు కేటాయించిన రిజిస్టర్ వాహనాలు అన్ని కాకుండా రెండు మూడు వాహనాలే తిరిగినట్లు గుర్తిస్తే వాటి ఆపేయాలని మిగిలిన వాహనాలకు అనుమతి ఇవ్వాలని సూచించారు.

రబీలో డిసెంబర్, జనవరి కీలకమని, కాలువల ద్వారా విడిచిపెడుతున్న నీటిని చెరువుల్లో మాత్రమే నింపాలని చెప్పారు. జలవనరుల శాఖ ఎస్ఇ సుధాకర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీలో నారాయణపురం ఆయకట్టు నీరు ఇవ్వలేమని చెప్పారు. మడ్డువలస ద్వారా మూడు ఎకరాల వరకు నీరిస్తామని తెలిపారు. సమావేశంలో డిసిఎంఎస్ ఛైర్మన్ గొండు కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీధర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, బిఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఇ డోల తిరుమలరావు, జిల్లా ఉద్యాన అధికారి ప్రసాద్, డిఎస్ఒ వెంకటరమణ, జలవనరుల శాఖ ఎస్ఇ పొన్నాడ సుధాకర్, పశు సంవర్ధక శాఖ జెడి కిషోర్, డ్వామా పీడీ చిట్టిరాజు, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వాసు, పలువురు ఎడిలు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు హెచ్చరించారు. నగరంలోని డ్వామా జిల్లా కార్యాలయంలో ఎపిఒలు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్లాంటేషన్ పనులతో పాటు ఫారం పాండ్స్, పెర్క్యులేషన్ ట్యాంకులు, మినీ పెర్క్యులేషన్ ట్యాంకులు, డగౌట్ పాంట్స్, మినీ గోకులాలు వంటి పనులకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. పంట కాలువల పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన అన్నిరకాల పనులను గుర్తించి అంచనాలు వేయాలని సూచించారు. వ్యక్తిగత పళ్లతోటల పెంపకంతో పాటు మునగ మొక్కల పెంపకంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్ 90 పనిదినాల కల్పన పనులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు కూలీలు పనులకు వచ్చే విధంగా క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించాలని స్పష్టం చేశారు. కూలీలకు వంద రోజుల పనిదినాల కల్పనకు అధిక ప్రాధాన్యతనకిచ్చి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో జిల్లాను నిలబెట్టేందుకు సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. సగటు కూలి రూ.250 వచ్చే విధంగా కూలీలతో పనిచేయించాల్సిన బాధ్యత సిబ్బందిదేనని స్పష్టం చేశారు. వారికి అవసరమైన కొలతలను ఇవ్వడంతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లకు కొలతలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎపిడిలు శైలజ, లోకేష్, మురళీకృష్ణ, డిబిటి, ప్లాంటేషన్ మేనేజర్లు శ్యామల, విజయవాణి, కె.వి అప్పలనాయుడు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ చట్టానికి తూట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సీనియర్ నాయకులు భవిరి కృష్ణమూర్తి విమర్శించారు. ఈ చట్టాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికులందరిపై ఉందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం జిల్లా పదో మహాసభలు నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సెస్సును ప్రభుత్వం సొంత అవసరాలకు దారిమళ్లిస్తోందన్నారు. ఈ నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా గత ప్రభుత్వం చంద్రన్న బీమా, మాతా శిశు సంరక్షణ, చలివేంద్రాల వంటి వాటికి ఖర్చు చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం వైఎస్సార్ బీమా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సెస్‌లోని నిధులను చట్ట వ్యతిరేకంగా మళ్లించి భవన నిర్మాణ కార్మికుల కడుపు కొడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు చెల్లించాల్సిన క్లయిమ్స్‌ను నిలుపుదల చేశారని చెప్పారు. జిల్లాలో సుమారు 7,800 క్లయిమ్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నిర్మాణ సామగ్రి ధరల పెంపు, ఇతర కారణాలతో కార్మికులకు చేతినిండా పని లేకుండా పోతోందని, దీంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు వారి కష్టాలను పట్టించుకోవడం లేదని, ఇటువంటి పరిస్థితుల్లో ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహాసభల్లో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా టి.హరినారాయణ, మంతెన హరనాథ్, గౌరవాధ్యక్షులుగా ఎం.ఆదినారాయణమూర్తి, కోశాధికారిగా ఎం.చక్రధర్, కమిటీ సభ్యులుగా జి.భీమారావు, టి.సింహాద్రి, సోమయ్య, ఎల్.లచ్చుమయ్య, భోగిరాజు, హేమ, టి.లక్ష్మణరావు, పి.రాము, బి.వాసు, ఎన్.లక్ష్మణరావు, వి.ప్రసాద్, ఐ.శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మహాసభల్లో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

టెండర్లు ఖరారు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో పలు వస్తువుల సరఫరాకు టెండరు, వేలంపాటను శుక్రవారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో నిర్వహించిన వేలం పాటలో ఏడాది కాలం పాటు విఐపిలకు అందజేసే ఫొటో ఫ్రేమ్‌లు, కండువాలు, శారీ, బ్లౌజ్ పీస్, సాదా కండువా, పరికిణి తదితర వస్తువులను అందించడానికి పాట నిర్వహించారు. వస్త్రాల సరఫరాకు కడప జిల్లాకు చెందిన నాగార్జున టెక్స్‌టైల్స్ పాట దక్కించుకున్నారు. కేవలం నలుగురు మాత్రమే పాటదారులు పాల్గొన్నారు. సాదా కండువా రూ.67, సిల్క్ కండువా రూ.120, రవిక రూ.47, ధరకు ఖరారు కాగా బొమ్మల కండువాను నగరానికి చెందిన దివాకర్ క్లాత్ సెంటర్ రూ.210కి టెండరు దక్కించుకున్నారు. ప్రోటోకాల్ నిమిత్తం స్వామివారి చిత్రపటాలను చిన్న ఫొటోలు, పెద్ద ఫొటోలు సరఫరా చేసేందుకు నగరంలోని ఎస్‌విజి ఆర్ట్ గాలరీ చిన్న ఫొటో రూ.169, పెద్ద ఫొటో రూ.485 వేలం దక్కించుకున్నారు. ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ పర్యవేక్షణలో పాలకమండలి ఛైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు ద్వారపు అనురాధ, శ్రీకూర్మం ఇఒ జి.గురునాథం పాల్గొన్నారు.

అంగన్వాడీల రాస్తారోకో

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 11వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా మానవహారాలు, ఇతర రూపాల్లో నిరసన కార్యక్రమాలను హోరెత్తించారు. శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేట వద్ద నాగావళి వంతెనపై రాస్తారోకో నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు బైఠాయించడంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, టి.రాజేశ్వరి, కె.ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు. ఎచ్చెర్లలో జాతీయ రహదారిపై, రణస్థలం మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, వెలమల రమణ, అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో పాత జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. పొందూరులో తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో చేపట్టారు. అనంతరం అక్కడ నినాదాలు చేస్తూ మానవహారం నిర్వహించారు. మండలంలోని అంగన్వాడీ కేంద్రాల తాళాలను సచివాలయ సిబ్బంది పగులగొట్టడంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.జ్యోతిలక్ష్మి, జి.నాగరత్నం, ఎస్.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో రాస్తారోకో చేపట్టారు. సమ్మె శిబిరాన్ని టిడిపి నాయకులు మామిడి గోవిందరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్వాడీల పోరాటానికి రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిర్ల ప్రసాద్, అంగన్వాడీ యూనియన్ నాయకులు హేమలక్ష్మి, జలజాక్షి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలస పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం మీదుగా వన్ వే జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.లతాదేవి, భూలక్ష్మి, మొదలవలస లత తదితరులు పాల్గొన్నారు. బూర్జలో పాలకొండ-శ్రీకాకుళం రహదారిపై అంగన్వాడీ కార్యకర్తలు రెండు గంటల పాటు రాస్తారోకో చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ట్రాఫిక్ స్తంభించి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రోడ్డుకు అడ్డంగా ఉన్న అంగన్వాడీలను పక్కకునెట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సమ్మెకు రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు ఆనెపు రామకృష్ణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు జ్యోతి, రాధిక తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో రాస్తారోకో నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయ శిబిరం నుంచి ఇందిరమ్మ విగ్రహం సెంటరు వరకు ప్రదర్శనగా వెళ్లి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో డి.ఆదిలక్ష్మి, పి.పద్మావతి, అరుణ, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు. పలాసలోని కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి బి.సునీత, కె.జ్యోతి, పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళిలో ప్రాజెక్టు కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ, సిఐటియు జిల్లా నాయకుడు హెచ్.ఈశ్వరరావు, జి.నీలన్న తదితరులు పాల్గొన్నారు. కవిటిలో అంగన్వాడీల సమస్యలపై సానుకూలంగా స్పందించి వాటిని పరిష్కరించాలని జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ డిప్యూటీ తహశీల్దార్ రామచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు.

11వ రోజుకు చేరిన సమ్మె

బూర్జ : అంగన్వాడీలను పక్కకు నెడుతున్న పోలీసు

కొత్తూరు : అంగన్వాడీల పోరాటానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎం.జి.ఆర్

పొందూరు : పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న అంగన్వాడీలు

ఎచ్చెర్ల : జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఇచ్ఛాపురం : పాత జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో...

సంతబొమ్మాళి : ఉపాధ్యాయులను సన్మానం చేస్తున్న రాములమ్మ

గర్వించదగ్గ గణిత మేధావి రామానుజన్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

దేశం గర్వించదగ్గ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ అన్నారు. కళాశాలలో గణిత విభాగం ఆధ్వర్యాన శ్రీనివాస్ రామానుజన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నెంబర్ తియరీ పై ఆయన విశేష కృషి చేశారన్నారు. నిత్యజీవితంలో గణితం ప్రతి ఒక్కరికీ అవసరమని, విద్యార్థులు గణితం పై పట్టు సాధించాలని సూచించారు. గణిత శాస్త్ర అధ్యాపకులు ఆర్.రవిశంకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంవి సత్యనారాయణ, సీనియర్ అధ్యాపకులు హెచ్.లక్ష్మీపతి, జయపాలరావు, వై.పోలినాయుడు, గణిత శాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

నగరంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యాన శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, కార్యదర్శి రాంగోపాల్, డిప్యూటీ డిఇఒ విజయకుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహించారు. జివిపి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా సిహెచ్ అప్పలనాయుడు, డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె శివశంకర్, గణిత విభాగాధిపతి ఎస్ శివకృష్ణ రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో కళాశాల గణిత ఉపాధ్యాయులు మౌనిక, వనజాక్షి విద్యార్థినులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పి.వి.పద్మావతి అధ్యక్షతన గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగి రాములమ్మ పాల్గొన్నారు. బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.రామకృష్ణ ఆధ్వర్యంలో గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు పుక్కళ్ల లక్ష్మణ రావు, వైసిపి సీనియర్ నాయకులు లండ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్కలి: మండలంలో పలు పాఠశాలల్లో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలావరణలో గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో వివిద గణిత ప్రక్రియలు చేపట్టారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసన్నపేట: స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అపారమైన మేధస్సుతో భారతదేశపు కీర్తి ప్రతిష్టలను ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచం అనుసరిస్తున్న దశాంశమాన పద్ధతిని వేల సంవత్సరాల క్రితమే భారతీయులు వినియోగించగా మనదేశం నుంచి అటువంటి గొప్ప గుర్తింపు పొందిన వ్యక్తని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌ఛార్జి ముకళ్ల శ్రీనివాసరావు, ప్లేస్మెంట్ అధికారి మేరీ రత్నం, గణిత అధ్యాపకులు వై.రాంబాబు, జి.అశ్విని పాల్గొన్నారు.

పొందూరు: మండలం పిల్లలవలస, తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసరామానుజం చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులకు క్విజ్, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. అలాగే గణితానికి సంబంధించి పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుగ్గు కాసులబాబు, బల్ల కంటయ్య, గణిత ఉపాధ్యాయులు పూజారి హరిప్రసన్న, చౌదరి వేణుగోపాల్, మురళీ పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలం అద్దానంపేట ప్రాథమిక పాఠశాలలో గణిత వైజ్ఞానిక ప్రదర్శన ప్రధానోపాధ్యాయులు కె.అరుణకుమారి పర్యవేక్షణలో జరిగింది. విద్యార్థులు ప్రదర్శించిన గణిత బోధనాభ్యసన సామాగ్రి పలువురిని ఆకర్షించాయి. గణితపార్క్, గణిత ఆకృతులు వంటివి ప్రదర్శనలో ఉంచారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే మండలంలో మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కెజిబివి, సంతవురిటి జిల్లా పరిషత్ పాఠశాల్లో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లంక అన్నా శామ్యూల్, కెజిబివి ప్రిన్సిపాల్ ఉషారాణి, సిగడాం, సంతవురిటి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.సిగడాం : అద్దానంపేట పాఠశాలలో గణిత వైజ్ఞానిక ప్రదర్శన

ఇచ్ఛాపురం : చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న అధ్యాపకులు

లావేరు : ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పొందూరు : ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కవిటి: మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపిటిసి పూడి నీలాచలం పాల్గొన్నారు. అలాగే మాణిక్యపురం, శిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కుసుంపురం ఎంపిపి పాఠశాల, కవిటి బివికెలో గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో బివికె విద్యార్థులు నిర్వహించిన గణిత అష్టావధానం, అంకెలతో ఆటలు, మనసులో మాట, మనో గుణకారం తదితర అంశాలు ఆకట్టుకున్నాయి.

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జాతీయ గణితదినోత్సవం నిర్వహించారు. రామానుజం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం గగనకుమారి, అధ్యాపకులు విజయ, తిప్పన జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే విజ్ఞాన భారతి విద్యాసంస్థల కార్యదర్శి జోహర్ ఖాన్ అధ్వర్యంలో గణిత దినోత్సవం వేడుకలు నిర్వహించారు.

నందిగాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిబాబు ఆధ్వర్యంలో గణిత దినోత్సవం సందర్భంగా రామానుజం చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అలాగే లాఖిదాసుపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు ఆధ్వర్యంలో గణితదినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సూర్యనారాయణ, కుమారస్వామి, రాము ఉన్నారు.

లావేరు: మండలంలో కెజిబివి పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు అనిత, శాంతి, ప్రమీల, అరుణకుమారి, హేమలత, శారదా, సుమంజలి, ఈశ్వరమ్మ, నాగమణి, గీత, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస: మండలంలో బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులకు గణిత క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎస్.వి.రమణారావు, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, డి.జనార్ధనరావు, బి.కిషోర్, ఎం.అరుణకుమారి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 26వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఉపాధ్యక్షులు గణేష్ తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం పొట్టి శ్రీరాములు జంక్షన్ వరకు ప్రదర్శన చేపట్టి అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, కార్మికులను రెగ్యులర్ చేయాలని ప్రదాన డిమాండ్లతో పాటు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లించాలన్నారు. పురపాలక శాఖ పరిధిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ హెలవెన్స్ అమలు చేయాలన్నారు. ఈనెల 26 నుంచి చేపట్టబోయే నిరవధిక సమ్మెలో అన్ని విభాగాల మున్సిపల్ ఆప్కాస్ కార్మికులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 23న బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కళ్యాణ్ రాజు, ఎ.రాము, ధనాల చిట్టి, ఎ.రాజేష్, ఎ.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు రమేశ్ కుమార్ పట్నాయక్ అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికే నిరవధిక సమ్మెపై మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. ఈనెల 26 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని మున్సిపల్ కార్మికులు నిరశన వ్యక్తం చేస్తూ మున్సిపల్ కార్యాలయం సమీపంలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యకు ట్యాబ్‌లు దోహదం

నందిగాం : విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న తిలక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లతో డిజిటల్ విద్యా పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి దోహద పడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి అన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ లు పంపిణా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కస్తూరిబా బాలికల పాఠశాలలో చైర్‌పర్సన్ చేతులమీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు డిజిటల్ పరిజ్ఞానంతో వారి ఉన్నత చదువులు సాగించడానికి జగన్మోహన్‌రెడ్డి టాబ్‌లు పంపిణీ చేపట్టి, విధ్యశాఖలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి పిలక విజయ్ భాస్కర్ రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ లోపింటి సత్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలాకి: మండలంలో చీడివలస గ్రామ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా, వైద్యానికి అత్యధిక నిధులు మంజూరు చేస్తుందన్నారు. విద్యపై పట్టుసాధిస్తే సమాజం అభివృద్ధి సాధిస్తుందని సూచించారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దాడ రాము, ఎంఇఒ టి.లింగరాజు, ప్రధానోపాధ్యాయులు దాలి బందు, స్థానికులు పాల్గొన్నారు.

నందిగాం: విద్యతోనే అభివృద్ధి జరుగుతుందనే ధ్యేయంతో సిఎం జగన్మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందజేసిన ట్యాబ్‌లను శుక్రవారం నందిగాం, దిమ్మిడిజోల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎంతో ఉన్నతాశయంతో విద్యాభివృద్ధి చెందాలనే ధ్యేయంతో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, విద్యార్థులు ఈ సౌకర్యాలు వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి ఆర్.లక్ష్మీకాంతం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, దీనబందపురం సర్పంచ్ సంజీవరావు, ఎంపిటిసి అంబోడి విష్ణు, సర్లాన బైరాగి, శ్రీరాములు, కుర్మా రావు, సంజీవరావు, బాలకృష్ణ, ఎంఇఒ నరసింహులు,హెచ్‌ఎం హరిబాబు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రభుత్వం అందిస్తున్న బైజూస్ కంటెంటతో లోడ్‌చేయబడిన ట్యాబ్ విధానంతో ప్రతి విద్యార్థి సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకోవచ్చుని మేజరు పంచాయతీ సర్పంచ్ కాళ్ళ సంజీవరావు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి. ప్రతాప్‌లతో కలిసి ట్యాబ్‌లను అందజేశారు. నాడు-నేడు ద్వారా నిర్మించిన మరుగుదొడ్లును ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ పండిత్ గోవిందరావు, రేషన్‌డీలర్ బొంతల కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొందూరు : వై నీడ్స్ ఎపి జగన్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్ అన్నారు. మండలం మొదలవలస గ్రామంలో శుక్రవారం వై నీడ్స్ ఎపి జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలో అందజేసిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేస్తూ ఏర్పాటుచేసిన బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, ఎమ్ఎల్ఒ మోహనరావు, నాయకులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలో కర్తలిపాలెం పంచాయితీ పరిధిలో శుక్రవారం ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ఎంపిపి డాక్టర్ దాసు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఎంపిపి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గున్నయ్య, ఎంపిడిఒ వెంకటరమణ, నాయకులు భాస్కరరావు, గోపయ్య, తిరుపతి, జ్ఞానేశ్వరరావు, సోమేష్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి నూకలు చెల్లాయి

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వానికి నూకలు చెల్లాయని, మరో మూడు నెలలు ఓపిక పడితే రానున్నది టిడిపి ప్రభుత్వమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మందస టిడిపి కార్యాలయంలో శుక్రవారం టిడిపి, జనసేన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేపడుతున్న ఆక్రమణలు, అరాచకాలను ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. నియోజకవర్గంలో మంత్రి అప్పలరాజు, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అవినీతికి పాల్పడ్డాతున్నారని ఆరోపించారు. మంత్రి సీదిరి అప్పలరాజుకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో మండల టిడిపి అధ్యక్షుడు భావన దుర్యోధన, తమిరి భాస్కరరావు, బమ్మిడి కర్రయ్య, రట్టి లింగారాజు, ముడుముంచి నవీన్ కుమార్, సవర రాంబాబు, దువ్వాడ సంతోష్ కుమార్, సవర లఖియా, సవర శంకర్, సవర నాగేంద్ర, సవర సోమేశ్వరరావు, సవర సుధాకర్, గౌరి అప్పారావు, సవర హరికృష్ణ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న పిడిఎస్‌యు నాయకులు

జాబ్ కేలండర్ విడుదల చేయాలి

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరుగుతుందని, సుమారు 25 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తక్షణమే జాబ్ కాలెండర్ విడుదల చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం ప్రకారం ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే మెగా డిఎస్‌సి వేస్తామన్న జగన్ అధికారంలోకొచ్చి నాలుగున్నర ఏళ్లు అవుతున్నా ఒక్క టీచర్ పోస్టు కూడా కొత్తగా భర్తీ చేయలేదన్నారు. వెంటనే మెగా డిఎస్‌సి నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సునీల్, విజయ్, కుమార్, బాలరాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పలాస: విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సివిల్ కోర్టు జడ్జి చక్రవర్తి మల్లా విద్యార్థులకు సూచించారు. కాశీబుగ్గ విద్యా వాహిని జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవా సంఘం ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తులో ఎలాంటి తప్పులు చేయకుండా జీవితంలో మంచి ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, కళాశాల ఎఒ పైల మన్మధరావు, కోర్టు సూపరెంటిండెంట్ పాణిగ్రహి, పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది విద్యార్థులు పాల్గున్నారు.

ఉద్యమ స్ఫూర్తి పాణిగ్రాహి

ప్రజాశక్తి- పలాస

మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారకహాల్ ఆవరణలో నిర్వహించిన విప్లవ సాంస్కృతికోద్యమ యోధుడు కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి 54వ వర్ధంతి సభ వేలాది ప్రజలను ఉత్తేజపరిచింది. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రజా కళామండలి శ్రీకాకుళం జిల్లా కమిటీల నేతృత్వంలో సాగిన సభకు వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి జీవిత సహచరి కామ్రేడ్ సురేఖా పాణిగ్రాహి అరుణ పతాకాన్ని ఎగరవేసి కామ్రేడ్ పాణిగ్రాహి చిత్రపటానికి పూలదండతో విప్లవ నివాళి అర్పించారు. వక్తలుగా ప్రగతిశీల మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, విరసం రాష్ట్ర నాయకులు కామ్రేడ్ పాణి, ఎపి అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నీలకంఠ, పలు విప్లవ, ప్రజా సంఘాల నాయకుల సందేశాలు, అరుణోదయ-ప్రజా కళా మండలి సంస్థల ఆట, పాట, మాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు సాగాయి.

న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో సుబ్బారావు పాణిగ్రాహి వర్ధంతి సభను నిర్వహించారు. పలాస కాశీబుగ్గ జంట పట్టణాలలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వి.మాధవరావు, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు తదితరులు పాల్గొన్నారు.

పాణిగ్రాహి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లరిస్తున్న నాయకులు

ఎస్‌ఐలుగా అన్నదమ్ములు ఎంపిక

తల్లి అన్నపూర్ణతో ఎస్‌ఐలుగా ఎంపికైన రాంబాబు, రవి

ప్రజాశక్తి- లావేరు

మండలానికి చెందిన ముగ్గురు యువకులు రైతు కుటుంబానికి చెందిన యువకులు ఎపిఎస్‌పి ఎస్‌ఐలుగా ఎంపికయ్యారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి ఎస్‌ఐలు కావడంతో ఆ కుటుంబంలో ఆనందానికి అవదులు లేవు.మండలం బెజ్జిపురం గ్రామానికి చెందిన రైతు కలిశెట్టి సన్యాసినాయుడు అన్నపూర్ణ దంపతులకు ఇద్దరు కుమారులు కలిశెట్టి రాంబాబు, రవి. తల్లిదండ్రులు కొద్దిపాటి వ్యవసాయం చేసుకుంటూ తమ పిల్లలను బాగా చదివించారు. ఇద్దరు పదోతరగతి వరకు బెజ్జిపురంలోనే చదివారు. ఇంటర్, డిగ్రీ శ్రీకాకుళంలో చదివారు. అనంతరం హైదరాబాద్, కాకినాడలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం శిక్షణ పొందారు. పోటీ పరీక్షల్లో పాల్గొని ఇద్దరు ఒకేసారి ఎస్‌ఐలుగా సెలెక్టయ్యారు. రాంబాబుకు 236 మార్కులురాగ, రవి 238 మార్కులు సాధించారు. అన్నదమ్ములు ఒకేసారి ఎస్‌ఐలుగా సెలక్టవ్వడంతో ఆ కుటుంబాన్ని గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తాము ప్రభుత్వ కొలువు సాధించడానికి ఎంతో కష్టపడ్డామని, మా తల్లిదండ్రులు రుణం తీర్చుకోలేనిదన్నారు. అలాగే మండలంలోని చిన్నరొంపివలస గ్రామానికి చెందిన చిత్రకి తరుణ్ ఎస్‌ఐ ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో జోన్-4లో 252 మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు ఈశ్వరరావు, లక్ష్మీ వ్యవసాయం చేస్తూ కుమారుడిని ఉన్నత చదువులు చదివించారు. తరుణ్ విద్యాభాసం అంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే సాగింది. తొలి ప్రయత్నంలోనే ఎస్‌ఐగా కొలువు సాధించాడు.

ఎస్‌ఐ ఫలితాల్లో సత్తా చాటిన నేతాజీ

కవిటి: మండలం నర్తుపుట్టుగ గ్రామానికి చెందిన నర్తు నేతాజీ జోన్-1లో మూడవ ర్యాంకుతో ఎస్‌ఐ ఫలితాల్లో కొలువు సాధించాడు. నేతాజీ తల్లిదండ్రులు రాజారావు, జేజమ్మ వ్యవసాయ కూలీలు. ఇద్దరు అక్కలు, తనకు చదివించే స్థోమత లేకపోవడంతో అక్కలకు మధ్యలోనే చదువు మాన్పించి పెళ్ళిళ్లు చేశారు తల్లిదండ్రులు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా నేతాజీ చదువుకు ఆటంకం లేకుండా చేశారు. నేతాజీ ప్రాథమిక విద్యను స్వగ్రామం నర్తుపుట్టుగలో అభ్యసించగా, ఆరు నుంచి పదో తరగతి వరకు బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇంటర్ నుంచి డిగ్రీ వరకు కవిటి ఎస్‌విజె విద్యాసంస్థల్లో సాగింది. ఉన్నతమైన ప్రభుత్వ కొలువు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న నేతాజీ అందుకు అనుగుణంగా సిద్ధమయ్యాడు. మధ్యలో రైల్వే గ్యాంగ్‌మెన్‌గా కొలువు వచ్చినా చేరలేదు. అనంతరం కాకినాడ శ్యామ్ ఇన్స్టూట్‌లో ఎస్‌ఐ కొలువు కోసం తర్ఫీదు పొంది ఇటీవల వెలువడిన ఫలితాల్లో మూడవ ర్యాంకు సాధించి ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలిచాడు. ఈ సందర్భంగా నేతాజీ ప్రజాశక్తితో మాట్లాడుతూ రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం తనదని, దాన్నుంచి బయటపడేందుకు విద్యనే ఆయుధంగా చేసుకున్నానని తెలిపారు. ఎప్పటికైనా సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని చెప్పారు. నేతాజీకి సర్పంచ్ శ్యామ్ పురియా, శ్రీకాంత్ పురియా, నర్తు భాస్కరరావు, దట్టి అజయ్, నర్తు సోమేశ్వరరావు, దట్టి ఈశ్వరరావు, గణప శివాజీ, గమ్మిడి పురుషోత్తం, నర్తు కాశీ తదితరులు అభినందనలు తెలిపారు.

తరుణ్

నర్తు నేతాజీ

కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న శిరీష

రాష్ట్రానికి చంద్రబాబు అవసరం

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును సిఎంను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం బాబూ ష్యూరిటీ భవిష్యత్‌గ్యారంటీ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం విస్తృతంగా చేపట్టడం జరిగిందన్నారు. అందుకు పార్టీ కార్యాలయం నుంచి ప్రసంశలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

పలాస-గుణుపూర్ (ఒడిశా) అంతరాష్ట్ర బస్సు సర్వీసును పలాస ఆర్‌టిసి డిపోలో శుక్రవారం మేనేజర్ ఆర్.సీతారామనాయుడు ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 4.45 గంటలకు పలాస డిపో నుంచి బయలు దేరి విశాఖపట్నం, శ్రీకాకుళం, ఆమదాలవలస, హిరమండలం, కొత్తూరు, హడుబంగి, కాశీనగరర్ మీదుగా గుణుపూర్ చేరుతోంది. మళ్లీ అదేరూటులో తిరిగి పలాస డిపోకు మరుసటి రోజు వస్తుందని డిఎం తెలిపారు. ఒడిషా ప్రయాణీకులకు ఈ బస్సు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎడిఎం సంతోష్ కుమార్, దాసరి శ్రీనివాస్, సిబ్బంది, కార్మికసంఘ నాయకులు పాల్గొన్నారు.

పెరటికోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి దాస్

పెరటికోళ్లు పంపిణీ

ప్రజాశక్తి- సోంపేట

మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపిపి దాస్ ఆధ్వర్యంలో మహిళా సంఘసభ్యులకు పెరటి కోళ్లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మహిళా సంఘసభ్యులకు ఆర్థికంగా చేదోడు అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ అవకాశాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎపిఎం రవణమ్మ, ఎంపిడిఒ వెంకటరమణ, సిఎఫ్‌లు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న సిబ్బంది

ఎంఆర్‌సి సిబ్బంది నిరసన

ప్రజాశక్తి- టెక్కలి

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మండల రిసోర్స్ కేంద్రంలో ఉన్న సిబ్బంది తమ ఆందోళనల్లో భాగంగా శుక్రవారం మండల విద్యాశాఖ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. గడచిన మూడు నెలలుగా బకాయిపడ్డ వేతనాలు ఆందివ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, దశాబ్దాలకాలం నుంచి తమతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడం లేదన్నారు. ఈ నెల 20 నుంచి సమ్మెబాట పట్టామని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ కార్యాలయ ఉద్యోగులు రవి, రాంబాబు, సంతోష్, మల్లేష్, రాజు, ధర్మారావు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

నేడు క్రిస్మస్ హై టీ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం హై టీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి క్రిస్టియన్లు హాజరు కావాలని కోరారు.

తులసిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పరుగు పోటీలకు విద్యార్థిని ఎంపిక

బూర్జ: మండలంలో కె.కె.రాజపురం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సనదుల తులసి రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 10న శ్రీకాకుళం పట్టణంలో కోడి రామ్మూర్తి నాయుడు స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి 2 కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 24న సామర్లకోటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.మాలతి తెలిపారు. విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పిఇటి అప్పన్న, గ్రామపెద్దలు అభినందించారు.

క్రీడా విద్యార్థులకు అభినందనలు

టెక్కలి: మండలంలో పెద్దసాన ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న దుబ్బక హరికృష్ణ, దాసరి రోషిత, పిల్లల నవదీప్‌లు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించడం పట్ల పాఠశాల ప్రదానోపాధ్యాయులు బొడ్డేపల్లి నేతాజీరావు శుక్రవారం అబినందించారు. ఇటీవల గుంటూరు జిల్లా రేపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను, శిక్షకులు జగదీష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

మృతుని కుటుంబానికి గౌతు పరామర్శ

పలాస: టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్ తండ్రి నర్సింహులు ఇటీవల మృతి చెందడంతో మాజీమంత్రి గౌతు శివాజీ మృతుడు కుటుంబాన్ని పరామర్శించారు. ఈయనతో పాటు మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు హేంబాబు చౌదరి, మందస మండల అధ్యక్షులు బావన దుర్యోధన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, తలగాన నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి రామ నాయుడు, గొల్ల చంద్రరావు ముడిమించి నవీన్ ఉన్నారు.

మృతి చెందిన యువకుడు

పోర్టు వాహనాన్ని ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి- నౌపడ

టెక్కలి మండలం నారాయణపురం వద్ద ఆగి ఉన్న పోర్టు వాహనాన్ని వెనుక నుంచి ఢీకొని సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందిన లోపింటి శేషురెడ్డి (25) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలకు మేరకు నౌపడ గ్రామానికి చెందిన శేషు టెక్కలి నుంచి నౌపడ గ్రామానికి శుక్రవారం రాత్రి 9:30 సమయంలో తిరిగి వస్తుండగా నారాయణపురం రహదారి వద్ద రెండు రోజులుగా ఆగి ఉన్న లారీని గమనించలేక వెనకనుంచి బలంగా ఢీకొన్నాడు. దీంతో తల ముందు భాగంలో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించడంతో టెక్కలి ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుడు తల్లిదండ్రులు చాలా ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడు ఇటీవలే మూలపేట పోర్టులో కూలి పనులు చేసుకునేందుకు చేరాడు. టెక్కలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలపై ఆరాతీస్తున్నారు.

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

మైనార్టీల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

దేశంలో మైనారిటీలకు అనేక హక్కులు పొందుపరచబడ్డాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని జామియా మసీదు ప్రాంగణంలో శుక్రవారం న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇతర వ్యక్తులతో సమానంగా మైనారిటీల హక్కులు పరిరక్షించబడుతున్నాయన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ వారికున్న హక్కులు, బాధ్యతలను తెలుసు కోవాలన్నారు. సమావేశంలో న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్, జామియా మసీదు ప్రెసిడెంట్ మహిబుల్లా ఖాన్, గవర్నమెంట్ ఖాజీ అబ్దుల్ వహాబ్ వక్ఫ్ బోర్డ్ మాజీ ప్రెసిడెంట్ హాజీ అమీరుల్లా, మాజీ జామియా మసీదు హాజీ మీర్ సాదికుల్ల తదితరులు పాల్గొన్నారు.

ఆసరా మహిళలకు వరం

ప్రజాశక్తి- పలాస

సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆసరా పథకం మహిళలకు వరం వంటిదని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపల్ మెప్మా కార్యాలయ ఆవరణలో డ్వాక్రా మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు స్వయంశక్తితో జీవనం సాధించాలని ఉద్దేశంతో మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. ఆసరా పథకం మహిళలకు ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులైన ప్రతిఒక్కరు పేర్లను నమోదు చేసుకొని ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, ఆప్షన్ సభ్యుడు బండి సంతోష్ కుమార్, వైసిపి నాయకులు

మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

అంబటి ఆనంద్, మార్పు యుగంధర్, మెప్మా అధికారి మోహన్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరమని తద్వారా ఆరోగ్యవంతమైన ఆర్థిక సమాజం ఏర్పడుతుందని వాకర్స్ మాజీ గవర్నర్ ఇందిరా ప్రసాద్ అన్నారు. అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్ (ఆశ్రా) ఆధ్వర్యాన దుప్పలవలస గురుకులం విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం హక్కులు భాద్యతలు, వివాదాల పరిష్కారం, ఫిర్యాదు చేసే విధానం నష్ట పరిహారం పొందే విధానం, బాల్య వివాహ చట్టం తదితర అంశాలపై మాట్లాడారు. సదస్సులో ఆశ్రా అధ్యక్షులు డాక్టర్ గంజి ఎజ్రా, న్యాయవాది కె.పార్థసారథి, గురుకులం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిరాజ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వైసిపి ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల, మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తల అధ్వర్యంలో వేరువేరుగా సాయిరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్, కె.మోహనరావు, పాతిర్ల రాజశేఖర్ రెడ్డి, పాల్గొన్నారు. అలాగే పట్టణంలో కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, వార్డ్ కౌన్సిలర్‌లు తాడి ఆదిరెడ్డి, ప్రేమ్ కుమార్, మధు మూర్తి, చాట్ల తిరుపతి, నీలపు ఢిల్లీ, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు,

సాయిరాజ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

సాలీనా గాంధీ, లోకనాథం రెడ్డి, పిలకా సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకే ఆరోగ్యశ్రీ

ప్రజాశక్తి- పలాస

సిఎం జగన్మోహన్ రెడ్డి పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆరోగ్య శ్రీ కార్డులు అందిస్తున్నామని 19 వార్డు కౌన్సిలర్ ప్రతినిధి శిష్టి గోపి అన్నారు. కాశీబుగ్గ సూది కొండ ప్రాంతం అంబేద్కర్ నగర్‌లో శుక్రవారం ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న గోపి

పేద ప్రజలు తమ కుటుంబ సభ్యులు ఆరోగ్యం కోసం అప్పులు చేసి ఖర్చులు పెట్టడం వలన మరింత పేద వారిగా అవుతున్నారని, వాటిని అధిగమించేందుకు రూ.25 లక్షలు ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బగాది సింహాచలం, మార్పు కృష్ణ, దుమ్ము రాజు, తోట రవణమ్మ, సచివాలయం ఎఎన్ఎం శ్రావణి, ఆశా వర్కర్లు పొన్నాన పార్వతి, జోగి రాణి, వాలంటీర్లు ఆది, రాధిక పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాపై సమీక్ష

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఈ నెల 26న ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలో పిఇటిలు, పిడిలతో శుక్రవారం ఎంఆర్‌సిలో ఎంఇఒ అప్పారావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆడుదాం ఆంధ్రా నిర్వహణ, విధి విధానాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

ప్రయోగాలు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

లక్కవరంలో పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి- సోంపేట

మండలంలో లక్కవరం గ్రామంలో శుక్రవారం స్థానిక వ్యవసాయ అధికారి బి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేశాఖ సంఘం సీనియర్ అధికారి కెవి సురేష్, గణాంకాధికారి ఎస్. రమ్య పర్యవేక్షణలో ఈ ప్రయోగాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటకు నీటితడులు తగిన మోతాదులో లేకపోవడంతో దిగుబడి తగ్గినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరు పంటల భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.

చైతన్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో జలక లింగుపురం గ్రామంలో పాతపట్నం నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి గేదెల చైతన్య జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మండల జనసేన అధ్యక్షులు దుక్క బాలరాజు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించి కేకును కట్ చేశారు. రక్తదాన శిబిరం నిర్వహించి 26 మంది రక్తదానం చేశారు. అలాగే జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 200 మంది రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవ్వల అనురాధ గణపతిరావు, పెద్ద పద్మాపురం సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్, ఉర్లాన వసంత్, పడాల శ్రీను, పాతపట్నం నియోజకవర్గం ఐటి ఇన్‌ఛార్జి వినోద్, కిరణ్, జనసేన, టిడిపి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో అవగాహన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొంటే వారిలోని ప్రతిభ బయటపడడంతో పాటు పరీక్షలపై అవగాహన పెరుగుతుందని స్థానిక విద్యాశాఖాధికారులు ఎస్.అప్పలరాజు, ఎల్.వి ప్రతాప్ అన్నారు. స్థానిక బ్లూమింగ్ బ్రడ్స్ పాఠశాలలో మండలస్థాయి క్విజ్ పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో మండలంలో గల 11 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా కురుడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమస్థానం దక్కించుకోగా, సిఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు ద్వితీయస్థానం సాధించారని పాఠశాల కరస్పాండెట్ నెయ్యిల చంద్రరావు తెలిపారు. వీరికి ఎంఇఒల చేతులమీదుగా బహుమతులు అందించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ డబ్బీరు దుర్గాప్రసాద్ తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఇఒలు

పొగమంచుకు పాడవుతున్న వాణిజ్య పంటలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న పొగమంచు వల్ల వాణిజ్య పంటలైన ఉల్లి, పెసర, మినప, మిరప, బెండ తదితర పంటలకు విపరీతంగా నష్టపోతున్నారు. రాత్రంతా కురుస్తున్న పొగమంచు వల్ల ఈ పంటలు పాడవ్వటంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు. మండలంలో జర్జంగి, శ్రీజగన్నాథపురం, చీపుర్లపాడు, నారాయణవలస, సౌడాం, రేగులపాడు, యలమంచిలి, చిన్నసాన, కన్నేవలస, పెద్దబమ్మిడి, హరిశ్చంద్రపురం, దుప్పిలపాడు, నీలంపేట, కొత్తపల్లి జియ్యన్నపేట, తర్లిపేట తదితర పంచాయతీల్లో ఉల్లి, మిరప తదితర పంటలు విస్తారంగా వేశారు. ఈ పొగమంచుకు పేను వ్యాధి వ్యాప్తి చెందడంతో ముడత తెగుళ్లు వచ్చి సమూలంగా నాశనమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిల్లో ఉద్యానవన శాఖాధికారులు అందుబాటులో ఉండి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

శ్రీ జగన్నాథపురంలో సాగు చేస్తున్న ఉల్లి

దట్టంగా కురుస్తున్న పొగమంచు

వణికిస్తున్న చలి పులి: గత రెండు రోజులుగా మండలంలో చలిపులి ప్రజలను, వృద్ధులను, చిన్నారులను వణికిస్తుంది. ఉదయం 7 గంటల వరకు ఎవ్వరూ బయటకు రాలేకపోతున్నారు. ఒకవైపు చలి, మరోవైపు పొగమంచు అలుముకోవడంతో ప్రజలు జలుబు, న్యూమోనియా వంటి వ్యాధులకు గురవుతున్నారు. అలాగే సాయంత్రం 5 గంటల నుండే చలి విపరీతంగా పెరగడంతో రాత్రివేళ బయటకు రాలేని పరిస్థితి. ఈ చలిపులి ఇంకా ఏన్నాళ్లు ఉంటుందోనని ప్రజలు అందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడినందున చలి ఎక్కువగా ఉండదని వృద్ధులు చెబుతున్నారు.